# వీణ

ఆనందమూర్తి గళము అన్ని రాగాల ఆనందానికి నిలయం. 'ఏమి పాట పాడతాడండి!'; 'అది సరస్వతీ కంఠము గదాండీ!' 'కాకలీ మృదులం-అహో!' అని సంగీత ప్రియులు తన్మయులై పోతూవుంటారు. ఇంతవరకు ఏగురువువద్దాశుశ్రూషచేయలేదు. తండ్రిగారిసంగీతంవినిన్నీ, గానసభలలోజనించిన మహాప్రవాహాలలో లయమైపోయిన్నీ నేర్చుకున్నపాటే యింత పులకరింపులైతే, ఏ సర్వేశ్వరుల పాదతీరాన్నో ఆనందమూర్తి పూజలు సలిపినట్లయితే అఖిల భారతదేశానికి నాయకమణియై పోవలసిందేగదా!—అని విద్వాంసుడు భరతశాస్త్రి సంతోష భాష్పాలను ఎడమ బొటన వ్రేలితో తుడుచుకొన్నాడు.

శుభ ముహూర్తం చూచి ఆనందమూర్తివైన నిన్ను శ్రీ సర్వేశ్వరుల మ్రోల మీ తండ్రి శిష్యునిగా అప్పగించి వచ్చినాడు. నీవు పదహారు సంవత్సరాల బాలకుడవు. సరస్వతి అవతరించిన శ్రీ సర్వేశ్వరుల పీఠము మ్రోల దేహానికి పులకలు, మనస్సుకు మఱపు, ఆత్మకు పరమానందము వరములిచ్చే ఉత్కృష్టకళ గాన విద్యను అభ్యసించే దీక్షపూనినావు.

ప్రౌఢ రాగాలు ప్రవహించే పరమ సౌందర్య ప్రదేశాలలో తాండవించినావు. దివ్యగాయకుల కృతి గభీరతలలో తేలినావు. గానకళాసూత్రం, శృతి రహస్యం, గురువులవారు ఆనందమూర్తికి ఉపదేశించే జ్ఞానముద్రను ధరించినారు.

## 2

స్వరూపపతి వీణానిర్మాత. తరతరాలనుంచి అతని కుటుంబమువారు వీణలు రూపొందిస్తూనే వున్నారు. స్వరూపపతి తండ్రి అకళంకపతి సర్వేశ్వరుల వీణ నిర్మించినాడు.

గాయకుడు దినదినము సంగీతలోలుడై వుండాలెనంట, అతని కంఠగత స్వనప్రవాహ శ్రుతులతో మేళవించే ధ్వని రాశి, మధురమూర్తిని ఆ వీణాకారులు నిర్మించేవారంట, మానవాతీతమయిన ఒకశక్తి ఆ వీణాజనకుని చేతిలో ప్రవహించునంట, సంగీతము మూర్తీభవించిన వీణా స్వరూపము ఆ మహాకల్పనలో నుంచి ప్రత్యక్షమవునంట.

ఆనందమూర్తి స్వరూపపతి గ్రామానికి విచ్చేసినాడు. ఓ ఆనందమూర్తీ! నీ సంగీతమును స్వరూపపతి నిమీలితదృష్టి తన్మయతలో విన్నాడు. ఆ సాయంకాలపు అరుణకాంతులలోని పాట తీవలై అలముకపోయినది. రాగాలా పనరక్తిము, రాగస్థాయి విహంగపధము, నీ దివ్యగాంధర్వాన ఓలలాడి, 'జన్మాన్ని అలుముకుపోయిన పాపలతలు తెంపబడ్డాయి: నేను ముక్తుణ్ని' అనుకున్నాడు స్వరూపపతి. ప్రాణమే రాగ ప్రవాహరేఖలో లీనమయిందట, ఉత్కృష్ట నాద స్వరూపము, మహోత్తమమైనట్టి వీణామ తల్లిని నిర్మించి తన జన్మ పావనం చేసుకుందామని స్వరూపపతి ఉవ్విళ్ళూరిపోయినాడు. ఆ దినాన్నుంచి వీణాకారునికి వైణికునికి నాదబిందు కళాపూజయే, ఆనంద విహారమే. కలశము కలలూరినది. దండము రూపించినవి. తుంభీఫలము మీటలు ప్రత్యక్షమయినాయి. సింహకరాళశిరము రేఖలు తిరిగినది. పండు పనసల పరువాలు. దంత ధావళ్యకాంతులు, బంగారు సుడులు, లతా పుష్ప విన్యాస చతురమయిన శిల్ప సౌందర్యము: సూక్ష్మ, స్థూల, వివిధ విచిత్ర తంత్రీ వైదగ్ధ్యము తళుక్కుమనే అద్భుత వల్లకీ బాల దివ్య ముహూర్తంలో సాక్షాత్కరించింది.

తీగలు సారించి, మీటలు బిగించి, గుళ్లు సవరించి, ఒయారంగా వల్లకిని వలెవాటువేసి భారతీ దేవిని ఆత్మ సారూప్యం చేసుకుని, ఆనందమూర్తీ! నీవు శ్రుతులు చూచుకొన్నావు. కంఠగీతి పరిమళంలో దివ్యనాదాన్ని లయింపజేశావు. స్వరూపపతి ఆనందపరవశుడై మూర్ఛపోయినాడు. అతడు వీణలో కలిసిపోయినాడు.

# 3

ఆనందమూర్తీ! నీ యశము దేశదేశాల వెలిగిపోయినది. మహారాజులు నిన్ను రప్పించుకున్నారు. కళాద్రష్టలు నీ పాటలో త్రిశరేణువులై పోయినారు.

ఆనాటి సభ, మహాపండితులసభ. వాండ్లను మెప్పించుట కళాబ్రహ్మలకును వెఱపు కలుగచేస్తున్నది. నీవు ఉప్పొంగి పోయినావు. ఈ నాటికి నీ జన్మ సఫలమయినదో లేదో నీకు వ్యక్తమైపోవుననుకున్నావు. వీణామ తల్లిని హృదయమార పూజించినావు. మహాసభకు నమస్కరించినావు. విద్యుల్లతికలగు నీవేళ్ళు వీణ తీగలపై ప్రసరించినవి.

ఆనాటి శ్రుతి ఓంకారము. మొదట కళాచమత్కృతులు చూపించినావు. కళారసజ్ఞత అల్పమై కళాజ్ఞాన రూపమయిన గానవిద్వత్త పండితులంతా హర్షించేటట్లు విజృంభింపచేసినావు. స్వరకల్పన, తాళగతి విచిత్రత, కష్టతమమైన వానిని సునాయాసముగా వెదజల్లినావు.

ఇంతలో ఆనందమూర్తీ, నీవు మైమరచి ఆనందలహరీ వేగమవై విజృంభించినావు.

అది మధురాతి మధురమగు రాగవికాసము. అది లయామృతవాహిని. నాలుగు తీగలూ శృతిగళములోని కాకలీ ప్రేంఖిత స్వనవల్లిత.

ఎన్ని కాలములు పైకివుబికినావో, శృతాశృతములైన కాలాలనెన్నింటి సూక్ష్మమైపోయినావో!

ఆ సభ పూర్తి అయినది. ఆనందరక్తిమల విరిసియున్నటువంటి మోముతో ఆనందమూర్తి కన్నులనీళ్ళను తుడిచే వారిని, కళ్ళుమూసి ఊగిపోతూ వున్నవారిని, చైతన్యంతప్పి ఏ అదృశ్యలోకాలకో ప్రవహించిపోయిన ప్రాణరహిత దేహాలను పరికించినాడు.

వాళ్ళమధ్య అందాలప్రోవై, బంగారుతీగవై, చెమరించు అమృతాధరోష్ఠయై, గీతావిష్టయైన త్రిభంగాకృతియై గాన లయాకృతార్ధనిమీలితయై,

నేపాలదేశ శ్వేతతారాదేవీ విగ్రహమై పదహారేళ్ళ బాలిక తెల్లని కేతకీపత్ర్ర గిలా కనబడినది. ఆ అమ్మాయివై పే విస్తుపోతూ చూస్తూ ఆనందమూర్తి సర్వమూ మఱచిపోయినాడు. అతని హృదయం తాళగతులు తప్పినవి. అతని కోర్కెలు రాగ మిశ్రమాలయినవి. ఆతని బ్రతుకు శృతికోసమై వెర్రిదానిలా తీగలు, గుళ్ళు, మీటలు సవరిస్తూనే వున్నది.

# 4

ఆలోచనలతో నిండి, ఆలోచనలులేని కలలతో, ఆనందమూర్తీ, విడిదివరకూ ఏలాగో నడిచినావు. దిండ్లుపరచిన కృష్ణాజినముపై చదికిలంబడి నిట్టూర్పు పుచ్చినావు. సేవకుడు వ్లాకినిదాల్చిన పేటిక తీసుకొనివచ్చుట యెరుగవు. దీపాల వెలుగులు తెల్లని గోడలపై నీ నీడను ఆడింపజేసినవి దృష్టిలేని చూపులతో చూచితివి. అంతా నిశ్శబ్దము. గృహ యజమాని స్నానానికి లెమ్మని ప్రార్థించుట యెరుగవు. ఆ బాలికే ఎక్కడేని ప్రత్యక్షమవుతున్నది! నీవు ప్రేమతపస్వివి అయితివా ?

ఏ మహారాగము సృష్టించుకొంటున్నావో అని గృహ యజమాని చప్పుడులేని పదాలతో వెనుకకు వెళ్ళిపోయినాడు.

ఆనందమూర్తి కడకు ఒక ముదుసలి ఆ బాలికను తీసుకొని వచ్చినట్లయినది. ఆనందమూర్తీ! కంపించిపోయినావు. బాలిక అర్పించు నమస్కారమును అందుకొనవు. ఋషివంటి ఆ వృద్ధునకు నమస్కారమిడవు. నీవు నిలుచుండినావు. మీరు ముమ్వురును అట్లనే నిలుచుండి పోయినారు. ఆ బాలిక మోము వివర్ణమగుచున్నది. సిగ్గుచే రక్తిమము తాల్చుచున్నది. గృహయజమాని వచ్చి, "స్వామీ! ఈలాగు వచ్చినారు ? తమ కుమార్తెతో యీ వూరు యెప్పుడు వచ్చినారు?" అని ప్రశ్నిస్తే, ఓ ఆనందమూర్తీ! అది కల కాదనుకున్నావు. ఆ బాలిక నీవైపు చూస్తూనూ వున్నది, అవ్యక్త మధుర మగు హాస్యంతో కన్నులు నేలవైపు వాలుస్తూనూ వున్నది.

గృహ యజమాని మిమ్మల్నందరినీ ఆసనాలపై అధివసింప చేసినాడు.

ఆ వృద్ధుడు నీ మొగమై, "బాబూ! ఇది నా మనుమరాలు ! మా కుటుంబము సంగీత కుటుంబము, యీ బాలికకు గాన విద్య పూర్తిగా నేర్పినాము. ఆమె సర్వకాలమూ స్వయంకృషి చేస్తూనే వుంటుంది. ఈ బాలికకు తగిన వరుడు నేటివరకున్నూ మాకు గోచరింపలేదు. నాయనా, నీవు దివ్య పురుషునిలా ప్రత్యక్షమయినావు. నీ కీర్తిలో జోగి నీకీ బాలికను సమర్పించి ధన్యుణ్ణవుదామని నా గ్రామాన్నుండి ఈనాటి సభకు వచ్చినాను. ఈ బాలిక ఫిడేలు వాద్యమునందు రాలుకరిగించు విమల గాంధర్వం వినిపించగల కళామూర్తి సుమా !" అని మనవి చేసికొన్నాడు.

ఆనందమూర్తీ, నీ మోము ప్రఫుల్లమైపోయింది. విద్యుల్లతలు నిన్నలమి నట్లయింది. ఈ విచిత్రము నమ్మవచ్చునా ! యిది ఐంద్రజాలికమా ?

## 5

ఆ దంపతుల జీవితం మహానదిలోని పడవలా తేలిపోతూ వున్నది.

ఆనందమూర్తి వీణ, ప్రేమబాల 'వాయులీన' (ఫిడేలు) రెండు జంత్రాల సంగమములో అంతర్వాహినియై వారిరువురి ప్రేమయున్నూ చేరిపోయింది.

ఒకళ్ళను మించిన అందం ఒకళ్ళది. ఒకళ్ళ ప్రేమను మించినప్రేమ ఒకళ్ళది.

వారి బ్రతుకు పేయితావుల పూలతోట అయింది. వారందులోని కోయిలలు.

## 6

నాటికి నాటికి ప్రేమబాలకు భర్తపై అనురాగం ఎక్కువై పోయింది. 'ఆతని స్వరూపం ఏ దివ్యమూర్తి కున్నది! ఒక్క నిమేషమైనా నాథుణ్ణి చూడలేక మనలేదు. ఎన్ని ముహూర్తములైనా ఆతని మోము తిలకిస్తూ ఆనందామృతములో సొక్కిపోతూ వుండేది. ఏదేని వంకతో ఆతనిని స్పృశించేది. ఆతని ముంగురులు దిద్ది పరవశ అయిపోవునది. అతనిని చిరుగాలివలె చుట్టివేయునది. ఆతని వెడదఉరాన్ని తన మోమును దాచుకొని వణికిపోవునది.

నానాటికి ఆనందమూర్తీ! నీ పత్ని గళనర్తితమగు మధురగాంధర్వమే నిన్నుమూలమంట కదల్చివేయునది. నీ వీణలోని మహాస్వర ప్రసారము నిన్ను యోగముద్రలో నిల్పివేయునది. నీ పత్ని నీ పాటలోని యొక శ్రుతియైనది.

ప్రేమబాలకు కాంతునిపై ప్రేమ విజృంభించినది. గాన కళాభిరుచి సన్నగిల్లినది. ఆనందమూర్తికి ప్రణయినీ విలాసము చిఱునవ్వు మాత్రము తెచ్చునది. ఆనందమూర్తి ఆనాటి ప్రేమావిష్టుడు కాడు.

## 7

ఆతని పాటకు, ఆతని తపస్సుకు ఆమె ప్రేమావేశము చిన్న అపశ్రుతి అయింది.

ఆమె ప్రణయరాగాలాపనంలో నాథుని గానయోగం దోషస్వరమైంది.

* * *

ఆనందమూర్తీ! వీణామతల్లికి నమస్కారంచేసి ఆమెను ధరించి నాద ప్రవాహం కల్పించుకొని విచిత్రాలైన కృతులు తానం పోకడలు, అయ

విజ్ఞానం స్వనింపజేస్తూ మైమరచిపోతూ వుంటే, దివ్యసుందరగాత్ర అయిన నీ ప్రేమబాల హృదయం కంటకవృక్షాన్ని కొట్టుకున్నట్లయ్యేది.

ఆ దినాల్లో నీ చూపులకు ప్రేమబాల అదృశ్య ! ఆమె ప్రేమ పూజ నీకు వేడిగాల్పు! ఆమె కౌగిలింతలు ఇనుపసంకెళ్ళు! పరీమళచుంబనము నాభీ పుష్పమధురము.

* * *

"ప్రేమబాలను అనిమేషుడవై చూస్తూ ప్రవహించిపోయిన మధురాతి మధురములగు సంధ్యలు, చంద్రికాయామినులు, నక్షత్ర ప్రకాశాలు, సౌరభదినాలు మాయమైపోయాయే! ఆనాటి ఆనందమూర్తివేనా ? నాథా! నాలో ఏమిలోపం వచ్చింది? నా దివ్యసౌందర్యము కలమాత్రమై ఆరతి కర్పూరంలా హరించిపోయిందా? నీదృఢపరిష్వంగ డోలికల్లో దెసలంటానే ప్రభూ!"

## 8

ఆనందమూర్తీ! నీ హృదయావేదన విచిత్రమైంది. బాలికల గానకళా ధ్యానం భర్తలకొరకా? నీ జీవితానికి అణువు అణువునా గాంధర్వం నిలుపుతా ననుకొన్నావు. గానమూర్తితో కలిసిపోయి ఐక్యమైపోతుంది నీ బ్రతుకు, త్రివేణిసంగములా, అనుకున్నావు. ప్రేమబాల మూడో ప్రవాహం. తన గాన తపస్సులో సంపూర్ణయోగంలేదా? గానంయొక్క వేరు స్వరూపం అనుకున్న ప్రియకాంత, అత్తరువు రాచిన బంగారు కమలం మాత్రమేనా ? లేక ఆమెను తన సంగీతములో లయింప చేసుకునేశక్తి తనకు నశించిపోయిందా ?

ఆమె అందమును చూచి నువ్వు లజ్జిస్తున్నావేం? ఆమె పన్నీరుపోసిన వేడినీటిలో సువాసన ద్రవ్యాలపిండి నలుగుపెట్టుకొని, తళుక్కుమనే నగలు, పూవులు చీర ధరించి చిత్రకారునికీ కవికీ భావానికందని అందంతో వస్తే,

నువ్వలా పెడమొగం పెడతావేం? శుకుడవా? ఋష్యశృంగుడవా? రసంలేని విద్వత్తవా?

వివాహమై రెండు సంవత్సరాలు కాలేదు. ప్రేమరసవాహినిలో ఆ దంపతులు ఇంకా సంపూర్ణ స్నాతులు కాలేదు. ఇంతలో ప్రణయభంగము శూర్పణఖలా వచ్చిపడింది.

ప్రేయసిని తీసుకువెళ్ళకుండానే ఆనందుడు సభలకు వెళ్ళుతున్నాడు. సభలో జరిగిన విచిత్రాలు ఆమెకు చెప్పడు. కొత్తరాగాలూ, పాటలూ విని పింపడు. అసలు నెలకు రెండురోజులన్నా ఇంటిదగ్గర వుండడు.

ప్రేమబాల విషాదబాల అయిపోయింది. ఆమె హృదయంలో అప శృతినాదాలు—వకదానివకటి తరుముకు వస్తూ వున్నవి. దొడ్డిలో గోపాలకుని కిష్టమ్మపదం, బంగారు పిచికల కలకలస్వరము, వీధిలో ముష్టివాండ్ర తందాన పాట, భర్తగారి ఉత్కృష్టమయిన వీణాగానం అన్నీ ఆమె జీవితానికి పెళ పెళార్భాటాలయి, వురుముల ధ్వనులయి కంపించివేసేవి. అందాలప్రోవయిన ఆ ప్రేమబాల ఈనాడు వడిలి, కమలిపోయిన పువ్వులా అయిపోయింది. వంటలక్క పచన రహస్యాలల్లో ప్రత్యక్షంచేసే రుచులు ప్రేమబాలనోటికి విషాదలయిపోయినవి.

# 9

ఓ ఆనందమూర్తీ? నువ్వా వెన్నెలలో వీణను ధరించి ఆ వసంత కాల వనసౌభాగ్యాన్ని స్వరాలల్లోకి మార్చావు. వెన్నెలే రాగమయింది. ఆకుల కలకలలు లయలయ్యాయి. అత్యద్భుత మైనటువంటివీన్ని, పరిమళ పూరితమయినటువంటివీన్ని ఒక కొత్తరాగమును ఆరోజున సృజించావు. రాగా లాపన ప్రవహింపచేశావు. హృదయకంఠశిరః ప్రదేశజనితాలయిన మూడు స్థాయిలూ "స్వతోరంజయతి శ్రోత్రం స్వరమిత్యభిధీయతే" అన్నట్లు రస స్వరూపాలయిన 'స్వరాలనన్నీ నిలుపుతున్నావు. ఆ రాగము మహాఋషి వెంకటమఖి రచించిడెబ్బది రెండు మేళాలల్లో శుద్ధ దైవతాన్ని ఆధారం

చేసుకున్న ఎనిమిదవ స్థానంలోనిది అయివున్నది. ఆ రాగం గ్రహ, అంశ, మంద్ర, తార, న్యాస, అపన్యాస, సన్యాస, విన్యాస, బహుత్వ, అల్ప త్వములనే పది లక్షణాలను కలిగివుంది. ఆ రాగం పూర్వమేళంలోని ఇందు చక్రం లోనిది. ఆ రాగం దేశీయ, ఔత్తరాహ, సాంప్రదాయాల కలయిక లోనిది.

ఆ రాగాలాపన ప్రథమాన్ని ఆక్షిప్తికమైంది. ఆనందమూర్తీ, రాగ వర్ధని చేసినావు. ఆరోహణమై, అవరోహణమై తానంలోకి దిగినావు. వేయిచంద్రుల రోక్కసారి పుష్పాలల్లే నిలిచినట్లయింది. పల్లవి ప్రారంభించి కీర్తనలోనికి విజృంభించి నావు. ఆ రాగము 'వసంత చంద్రిక' అని పేరు పెట్టుకున్నావు. ఆహా! ఆ గానము పరమ మాయా సౌందర్య పూరితం అయి పోయింది.

ఉదయాన్నే ప్రాణప్రియుడు తన్ను పలుకరించిన పలుకులో, హాస్య రసపూరితమయిన నర్మభాషణలో వేయి అర్థాలు గ్రహించుకుని ప్రేమబాల ఉలిక్కిపడినది. ఆమెను మధురతరంగాలు ముంచివేసినవి. ఆమె హృదయ ములో వెన్నెలలు పిండి ఆరబోసినవి. ఆ సాయంత్రం పన్నీట జలక మాడింది. కలలూరు చీనాంబరము ధరించినది. ఒకటి రెండు ముద్దుగులుకు నగలతో గంభీరంగా అలంకరించుకున్నది. మల్లెపూలు జడవేస్తున్నది. నెత్తిపై కనకాంబరాలు జరీ సూత్రంతో కట్టి, అర్ధచంద్రిక అలంకరించు కున్నది. ఆ రాత్రి దీపాల వెలుగుల్లో ఆమె దివ్యసౌందర్యరాసి, ప్రేమ తేజస్విని.

తోటలోకి కిటికీలు తెరచి వున్న వాళ్ళ శయన మందిరాన్ని శ్రీ శుకులవారి హృదయం కూడా కరిగించివేసేటట్లు ప్రేమబాల అలంక రించింది.

కిటికీలోంచి వెన్నెట్లో సన్నజాజి, గులాబి, మల్లెతీగె సంపెంగపొదల మధ్యనవున్న శిలావేదిక పైన కృష్ణాజినంపరచుకొని తన్మయుడయి వీణ పాడుకుంటూ వున్న భర్తను చూచింది. నెమ్మదిగా దొడ్డి గుమ్మం మెట్లు

దిగి, నాథుడున్న శిలా వేదిక దగ్గరకు పోయి, ప్రేమబాల భర్త ప్రక్కనే కూర్చున్నది.

# 10

ఆ పవిత్ర నిశాఘటికల్లో ఆ వీణ దివ్యస్వరాలు విరజల్లి వేసింది. ఆనందమూర్తి, ప్రేమబాలకూడా అట్టి మహాఅద్భుతమయిన వాణి గంభీరత, మాధుర్యాతి మాధుర్యము ఎన్నడూ చూరగొని యుండలేదు. నిమేషాలు గడియ లయ్యాయి, ఒక్క యామమయింది తుంబుర, నారద, శారదా దేవుల వీణలను అపశ్రుతి బూయిస్తాలని అనిపించేటట్టు విజృంభించి పోతూంది.

ఇంతలో ఆ వీణ ప్రేమబాలకు ఒక యక్షిణీలా తోచింది. ప్రేమ బాలను హేళనచేస్తూ ఆ విచిత్ర గానంలో విజృంభించి పోతూవున్నట్లయినది. భర్త యీ లోకములో లేడు. ఏ గాంధర్వ లోకంలోనో! "ప్రేమకన్న ఉత్కృష్టమైన గాంధర్వము వేయిరెట్లు ఎక్కువ: ఓసి వెర్రిబాలికా, ఇక్కడి నుంచి శీఘ్రంగా నీ పడకటింటిలోకి పో! యీ గానకళా పుంజము నా పతి సుమా! నువ్వు నారాజుకూ నాకూ అడ్డంవచ్చేటట్టుచేశావు.కాని నేను నీఆటలు సాగనివ్వలేదు. నీ ఋడేలు పాట మంత్రంచేసి, నా యీ నాథుణ్ణి దూరము చేస్తారని అనుకున్నావా ?" అని ఆ వీణ ఆ మంత్ర గానంలోనే పలికి నట్లయింది.

ప్రేమబాలకు చెమటలు పట్టినవి. ఆమె గజగజ వణికిపోయింది. ఎలాలేచి నడిచివెళ్ళిందో! శయన గృహందాకానైనా వెళ్ళలేదు. "ప్రభూ యింతేనా" అంటూ కనకాంబరం మొక్కలవద్ద గుభాలున పడి మూర్ఛ పోయింది.

ఆనందమూర్తీ! నీ గాన తపస్సు పూర్తి అయినది. ఆ ఆనందము యొక్క పులకలు నీ మనస్సులో చిరుకెరటాలుకాగా నువ్వు గంధర్వ యువ రాజులా లేచినావు. నీ హృదయం ఆ యీనాటి నూత్న రాగము, కృతి,

తాళము పాడుకుంటూ వుండగా, ఆ ధ్యానములో ఎలా చేరావో నీ పడక గదికి. దానిలో పడివున్న ప్రేమబాల నీకు కనపడలేదు. పర్యంకముపై పత్ని లేదన్న భావమే నీకు కలుగలేదు. ఘోర బ్రహ్మచారిలా, సరసమెరుగని పరమ మూర్ఖునిలా, ప్రణయంలో పులకరించి పోని బాలకునిలా శయన గృహం అందం కనిపెట్టక, అగరుధూపాల ఆనందించిపోక, శయనమందిరం నింపివేసిన వివిధ పుష్ప పరిమళాల్లో ఓలలాడిపోక, శిల్ప హృదయులయిన నీ భార్య అలంకరించిన శయనమందిరం యొక్క తల్పం యొక్క సౌందర్య విన్యాసాల్లో తోగిపోక, లంబభుజు డులా మంచంమీద పడుకుని నిద్ర పోయినావు. సంగీతము జీవితాన్ని కర్కశం చేస్తుందా?

ఇంతలో ప్రేమబాలపై ఒక చిరువెన్నెల చెలికత్తెలా వ్రాలి, శీతలో పచారాలు చేసి ఆమెను మృదుహస్తాలతో స్పృశిస్తూ మూర్ఛలో నుంచి లేపింది. ప్రేమబాలకు లోకమంతా ఇంకా చీకటిగానే వుంది. కళ్ళు నులుము కుంటూ ఏల అక్కడ పడివున్నదో, శయనమందిరంలో ఎందుకు లేదో ? ఆమెకు అర్థముకాకుండానే తూలుతూ పడక గదిలోకి వెళ్ళింది. ఆ దీపాల వెలుతురులో భర్త గుర్రుపెట్టి నిదురపోవడం వినీ, చూచీ గబుక్కున సంపూర్ణ జ్ఞానంకలుగగా తెల్లపోయిచూచింది. భర్త ఎప్పుడూ గుఱ్ఱు పెట్ట లేదు. ఆమెకు అప్పుడు భర్తయొక్క హృదయం ప్రేమరహితమయిన మరుభూమిలా తోచింది.

దివ్యాంగన అనుకున్న వల్లకీబాల తనకీ, నాధునికీ తెగతెంపులు కలుగజేయడానికి జన్మించిన రాక్షసి అని తానెప్పుడూ అనుకోలేదే ! నాధుని చేరవచ్చి రెండేండ్లుకాలేదు, ప్రణయస్వరూపమైన వీణామతల్లి పరమశత్రు వయిందా? ఓ వీణాదేవి! నీకేమి అపకారం చేసిందమ్మా? తన పతిని నిన్ను ప్రేమించ వద్దన్నదా? నీ స్నేహంలో తన్మయుణ్ని కావద్దన్నదా ? కళా స్రష్టలేరా? వారు తమ హృదయాల్లో నివసిస్తూ వున్న ప్రాణకాంతల్ని మర చారా? నీకు దయలేదు. నీ హృదయం వట్టిగాలి. నీ బ్రతుకు కర్రమొద్దు. నువ్వు తననాథుణ్ని లోహపాశాలువేసి బంధించావు. నీవు మామూలు వీణవు

కావు! నువ్వు రాక్షసివి! పెనుభూతంలా కుటుంబములో ఆవిర్భవించావు. ఈ రోజుతో నీ జీవితం సమాప్తి! !

# 11

ప్రేమబాల మహోగ్రబాల అయింది. ఆమె కన్నులు విస్ఫులింగాలు రాల్చినవి. ఆమె కాత్యాయని, మహాకాళి మూర్తి! భయంకర చండీమాత. రెండు అంగలలో సంగీత మందిరాన్ని చేరుకుంది. పూజాపీఠంమీద వల్లకీ పేటిక తెరిచింది. ఆ వీణను మోటుగా యీవలకు లాగింది. ఆ వీణాబాల గజగజలాడిపోయింది. ప్రేమబాల తీగలన్నీ ముక్కలు ముక్కలుగా తెంపి వేసింది. మీటలు పూడపెరికింది. గుభ్యా, తంత్రీపీఠము దూరముగా విసిరి వేసింది. తుంభీఫలము లాగివేసింది. సింహముఖము చితకగొట్టడానికి సిద్ధం పడుతూ వుండగా వక్కపరుగున ఆనందమూర్తి "ఆ! ఆ!" అనుకుంటూ వచ్చిపడ్డాడు.

మైమరచి నిద్రపోతూవున్న ఆనందమూర్తికి చటుక్కున ఓ కల వచ్చింది. ఒక మహాశక్తి భయంకరముగా తన్ను తరుముకువస్తూ, "ఓయీ! నీవు నా మీద భక్తి మానేశావు. ఇందుకు అంతా నీ వీణే కారణం!" అని అంటూ తన వీణను అతని చేతుల్లోంచి లాగి ముక్కలు చేయడానికి ప్రారంభించిందట! ఆనందమూర్తికి గుండె దడదడమంటూ చెమటలు పడుతూ వుండగా తటాలున మెలకువ వచ్చింది. "అమ్మయ్యో." అంటూ సంగీత మందిరం చేరుకున్నాడు.

ఓ ఆనందమూర్తీ మహోగ్రమూర్తి అయిన భార్యను చూచి వణికి పోయావు. ఆమె చేతుల్లో రూపం మారిపోతూ వున్న నీ అనుంగువల్లకిని చూచి కెవ్వున అర్చి ఆ వీణమీద మూర్ఛపోయావు.

ప్రేమబాలకు స్మృతి తెలిసింది. తాను చేసిన పని చూచుకుంది. మూర్ఛలో మునిగివున్న భర్తను చూసింది. భర్త అల్లా పడివున్నాడేమి ? అయ్యో, వారికి ఆపత్తు కలుగలేదు కదా? పరమశివా, ఏమిటీ ఘోరం, ఆ

వీణనుతానేనాపాడుచేసింది? నిజమా? నిజమా? భర్తనుతనఒళ్లోకి చేర్చుకుంది. ఆతని తలను తన హృదయాని కద్దుకుంది. ఆయన మోమును పెదవులతో స్పృశించింది. ఆమె లోచనాంచలాల్లోంచి జలజల బిందుప్రవాహము వెచ్చగా నాధుని తలపై, మోముపైపడి, తడిపివేస్తూ ఆనందమూర్తికి మెలకువ తెప్పించినది.

## 12

ఆనందమూర్తి కళ్ళు తెరవగా ప్రేమపూరితమై ప్రేమచే విషాదమేఘావృతమై, కోలమై, లలితరేఖా పూర్ణమై, బంగారు వెన్నలా స్విన్నమై, వివర్ణమై, ముంగురులు ఆవరించినదియై, విషాదంలో కూడా వింత సౌందర్య యుతమైన ప్రేమబాల తన ప్రేయసియొక్క మోము ప్రత్యక్షమైంది. ఆతని గుండె పరమ కరుణచే దడదడలాడినది. ప్రేమబాల ఏనాడు తనకూ తన ప్రజ్ఞకూ అడ్డం వచ్చింది? ఏనాడు తన విద్యను ప్రోత్సాహింపలేదు! ఆమె తన జీవిత ప్రవాహంలో వేరొక శైవాలినీ బాలలా సంగమించేనప్పటినుంచి, తన కళాచాతుర్యం వేయిరెట్లు వృద్ధికాలేదా? ఎందుకూ తనకూ తన ప్రేమమూర్తికీ ఈలాంటి హృదయ భేదము వచ్చింది? స్వరూపపతీ, నువ్వు నిర్మించిన వీణ పరమసాధ్వీమతల్లి దివ్యాంగన. ఆమెకు హృదయంలో ప్రేమ తప్ప ఇంకేమి వుంటుంది? ఈ విషాద నాటకంఅంతా తమ మనస్సుల్లో జన్మించిందేనా?

ఆతని హృదయంలో ప్రేమ మహా ప్రవాహం, వుప్పెనలా వచ్చి పడింది చటుక్కున ఆనందమూర్తీ, ప్రేమబాల ఒళ్లోంచి నువ్వు లేచినావు. ఆమెను నిండుతమిపై హృదయాని కదుముకొన్నావు. అశ్రుపూరిత నయనాల్ని, చెదిరిన ముంగురులతో నిండిపోయిన మోమును, కలిగిపోయిన పువ్వులతో గజిబిజి అయిన పొంకమైన శిరాన్ని చుంబించినావు. ఆమె సుళ్ళు తిరుగు చెక్కిళ్ళు, చిబుగడ్డము, తేనెలూరు పెదవులు ముద్దుగొన్నావు.

ప్రేమబాల ఆశ్చర్య చకిత, ఆనందమయి అయిపోయింది. ఆమె కన్నుల్లో, ఫాలంలో కేశసౌభాగ్యంలో, చెక్కిళ్ళల్లో, గడ్డంలో పెదవుల్లో, విచిత్రకాంతులు అలిమినవి.

ఇరువురూ వల్లకీబాలను నూత్న తంత్రులతో అలంకరించినారు. అన్నీ సవరించినారు. యథాప్రకారం వీణామతల్లి పరమగాంధర్వ మూర్తై పోయింది.

నాథునికడ నేర్చుకున్న ఆనాటి విద్వత్తతో ప్రేమబాల వీణను మీటింది. ఆ వీణ.

"చైతన్యం సర్వభూతానాం వివృతిం జగదాత్మనాం
నాద బ్రహ్మ తదానందం అద్వితీయం" అయింది.

ఆ ముప్పురూ ఒకళ్ళల్లో ఒకళ్ళయినారు.